సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 14 । ఆగస్టు । 2023



పరారీలో చిట్టీల వ్యాపారి?
చిట్టీల వ్యాపారి రూ.4 కోట్లతో ఉడాయించిన సంఘటన శాలిగౌరారం మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. - 8లో



దైవదర్శనానికి వెళ్లొస్తూ..
దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా నేరేడుచర్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. - 8లో



విశ్వబ్రాహ్మణులు..
విశ్వబ్రాహ్మణులు ఎన్నో కళలకు ఆద్యులని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

నేటి నుంచి 24 వరకు గాంధీ చలన చిత్ర ప్రదర్శన

భువనగిరిటౌన్‌: స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపులో భాగంగా 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జిల్లాలోని పలు థియేటర్లలో గాంధీ చలనచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించనున్నట్లు కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ వీరారెడ్డి, రెవెన్యూ డివిజన్‌ అధికారులు, జిల్లా విద్యా శాఖ అధికారి, తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, మండల విద్యాధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌ నిర్వహించి, గాంధీ చలన చిత్ర ప్రదర్శన ఏర్పాట్లపై సమీక్షించారు. 14వ తేదీన ఉదయం 8.30 గంటల నుంచి గాంధీ చిత్ర ప్రదర్శన ఉంటుందని, 15వ తేదీన ఇండిపెండెన్స్‌ డే సందర్భంగా, 20వ తేదీన ఆదివారం కావడంతో చిత్ర ప్రదర్శన ఉండదని తెలిపారు. 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. థియేటర్ల నిర్వాహకులు, విద్యాశాఖ, సంబంధిత శాఖల సమన్వయంతో ఈ చిత్ర ప్రదర్శనను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కేసీఆర్‌ కృషి



మాట్లాడుతున్న గొంగిడి సునీత

యాదగిరిగుట్ట: బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్‌ కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్‌ గొంగిడి సునీత అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆదివారం 'మేమెంతో.. మాకంత' నినాదంతో తెలంగాణ కరణం వియోగ బ్రాహ్మణ ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్రంలోని ధూప, దీప, నైవేద్య అర్చకులందరికీ జీతాలు పెంచారని తెలిపారు. అంతేకాకుండా బ్రాహ్మణ పరిషత్‌ ఏర్పాటు చేసి, రూ.100 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరణం బ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం కరణం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో కరణం బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలి



జగ్గారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆటో కార్మికులు, నాయకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్టలో ఆటో కార్మికుల సమస్యను సీఎం కేసీఆర్‌ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేలా కృషి చేయాలని కోరుతూ సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డిని ఆటో కార్మికులు, కాంగ్రెస్‌ నాయకులు కోరారు. ఆదివారం యాదగిరిగుట్టలో జరిగిన కరణం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన ఆయనను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానాలయం ఉద్ఘాటన జరిగిన నాటి నుంచి యాదాద్రి కొండపైకి ఆటోలను నిలిపివేశారని, దీంతో 300 కుటుంబాలు రోడ్డుపడ్డాయన్నారు. ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ సమస్యను సీఎం కేసీఆర్‌ దృష్టికి తీసుకెళ్తానని, పర్సనల్‌గా లెటర్‌ సైతం పెడతానన్నారు. వినతిపత్రం అందించిన వారిలో అసంఘటిత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు నర్సింహ గౌడ్‌, కాంగ్రెస్‌ పార్టీ జిల్లా కార్యదర్శి సతీష్‌ భట్‌రాజ్‌, ఆటో జేఏసీ అధ్యక్షులు మొగులయ్య, సోషల్‌ మీడియా నియోజకవర్గ కన్వీనర్‌ గుడ్ల నరేష్‌, మైనార్టీ సెల్‌ పట్టణ అధ్యక్షులు సలాం తదితరులున్నారు.

మరోసారి మోసానికి తెరలేపిన కేటీఆర్‌

భువనగిరి: మంత్రి కేటీఆర్‌ ఎన్నికలకు ముందు చేనేతలను మరోసారి మోసం చేయడానికి తెరలేపినట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 జూన్‌లో పోచంపల్లి సాక్షిగా నేత బజార్‌ను పునరుద్ధరిస్తామని చెప్పారని, కానీ నేటికీ అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌కు ఎన్నికలు వస్తే తప్ప పథకాలు గుర్తుకు రావని తెలిపారు. చేనేత కార్మికుల ఇన్సూరెన్స్‌ నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. మాయమాటలతో ఎన్నికల ముందు హడావుడి చేయడం తప్ప చేసేదేమీ లేదని తెలిపారు. ఇప్పటికైనా చేనేత కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని సూచించారు.

యాదాద్రిలో శాస్త్రోక్త పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం నిర్వహించి, నిజాభిషేకం జరిపించారు. సహస్రనామార్చన విశేషంగా చేపట్టి, తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు విశేషంగా చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు



ప్రధానాలయంలో భక్తుల రద్దీ

దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరిటౌన్‌: 2023–24 సంవత్సరానికి గాను విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేడ్కర్‌ ఓవర్సీస్‌ విద్యా నిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ అధికారి జయపాల్‌ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు telanganaepass.cgg. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

గృహలక్ష్మి యోగం ఎవరికో..

నేటి నుంచి అర్హుల ఎంపిక కోసం సర్వే ప్రారంభం

- జిల్లా వ్యాప్తంగా 34,147 దరఖాస్తులు
- అత్యధికంగా గుండాల మండలం నుంచి 2,963, అత్యల్పంగా మోత్కూర్‌ మండలం నుంచి 678



ఆత్మకూరు(ఎం)లో పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు అందజేస్తున్న సీనియర్‌ అసిస్టెంట్‌

భువనగిరి: సొంత స్థలం ఉండి సొంతింటి కలను నిజం చేసుకోలేని నిరుపేదల కోసం ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణను చేపట్టి 10వ తేదీన పూర్తి చేశారు. మిగతా ప్రక్రియ కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి అర్హుల ఎంపిక కోసం సర్వే నిర్వహించనున్నారు. ఇప్పటికే సర్వేలో పాల్గొనే అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు అవగాహన కల్పించారు. జిల్లాలోని 17 మండలాల పరిధిలో ప్రారంభించిన సర్వే ఈనెల 20న పూర్తి చేసి మంజూరు పత్రాలను ఇచ్చేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. సర్వేలో అర్హులైన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 34,147 దరఖాస్తులు

జిల్లాలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఈ నెల 8, 9, 10వ తేదీల్లో చేపట్టారు. గడువు మూడు రోజులు ఇవ్వడంతో తహసీల్దార్‌, మీ సేవా కేంద్రాలు దరఖాస్తుదారులతో కిటకిటలాడాయి. మొత్తం 34,147 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా గుండాల మండలం నుంచి 2,963, తక్కువగా మోత్కూర్‌ మండలం నుంచి 678 దరఖాస్తులు వచ్చాయి. మున్సిపాలిటీల్లో అత్యధికంగా చౌటుప్పల్‌లో 788, తక్కువగా యాదగిరిగుట్టలో 146 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు పూర్తి స్థాయిలో ఉన్నాయి. ఒక్కో నియోజకవర్గానికి 3 వేల గృహలక్ష్మి యూనిట్లు మంజూరయ్యాయి. అర్హులైన వారు ఎక్కువగా ఉంటే మిగిలిన వారికి రెండో దశలో ఇవ్వనున్నారు.

అర్హతలు ఇవే..

- మహిళ పేరిట వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు
- తెల్లరేషన్‌ కార్డు కలిగి ఉండి, అందులో దరఖాస్తుదారు పేరు ఉండాలి.
- దరఖాస్తుదారు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటే అనర్హులుగా గుర్తిస్తారు.
- దరఖాస్తులో దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 50 శాతం, ఎస్టీలకు 10, బీసీ, మైనార్టీలకు 50 శాతం, జనరల్‌కు 15 శాతం కేటాయిస్తారు.
- గతంలో ఇల్లు మంజూరైనా, దళితబంధు, ఇతర పథకాలు పొందినట్లు అయితే దరఖాస్తులను తిరస్కరిస్తారు.
- సొంత స్థలం కనీసం ఒక గుంట భూమి పట్టా ఉండాలి.
- పాత, శిథిలావస్థలో ఇల్లు ఉంటే ఇంటి పన్ను, విద్యుత్‌ బిల్లు చూపించాల్సి ఉంటుంది.
- మంజూరు పత్రాలు అందిన తర్వాత ఇంటి నిర్మాణం ప్రారంభించవచ్చు.
- బేస్‌మెంట్‌ లెవల్‌లో రూ.లక్ష, రూమ్‌ లెవల్‌లో రూ.లక్ష, పూర్తయిన తర్వాత రూ.లక్ష మొత్తంగా రూ.3 లక్షలు అందించనున్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



మహారుద్రయాగంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ఆలేరురూరల్‌: ప్రతిఒక్కరూ భక్తిభావం, దైవచింతనను అలవర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో శ్రీమాతాపితృ గోక్షేత్రంలో కొనసాగుతున్న మహారుద్రయాగంలో ఆదివారం ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోమాతల ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. గోక్షేత్రంలో మూడు రోజులు పాటు ఇంతపెద్ద యాగాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కొలనుపాక గ్రామంలోని జైన మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంకట్‌రెడ్డి, బిజుమళ్ల బిందుమాధవ శర్మ, పులిసీతారామశర్మ, కుమార్‌, సత్యం, సర్పంచ్‌ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిభద్రతలు పరిరక్షించాలి



భువనగిరిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

భువనగిరి : మణిపూర్‌లో శాంతిభద్రతలు పరిరక్షించాలని ఫాలోషిప్‌ అధ్యక్షుడు జాన్సన్‌ అన్నారు. ఆదివారం భువనగిరిలో జిల్లా పాస్టర్స్‌ ఫాలోషిప్‌ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక రహదారి బంగ్లా నుంచి వినాయక చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. చంద్రయ్య, ఇస్సాక, పాల్‌ రెడ్డి, ప్రేమ్‌కుమార్‌, ప్రసాద్‌, బాలస్వామి, జూలియస్‌, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీకి సిద్ధం

- అర్హుల జాబితా రూపొందించిన ప్రభుత్వం
- జిల్లాకు 365 కేటాయింపు
- ఒక్క భువనగిరి మున్సిపాలిటీకే 200 మిషన్లు కేటాయించడంతో మిగతా మండలాల ప్రజల ఆందోళన
- నేడు కలెక్టర్‌ను కలవనున్న అఖిలపక్ష నాయకులు

భువనగిరిటౌన్‌: మైనారిటీ మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ స్టేట్‌ మైనారిటీస్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ కింద 'కేసీఆర్‌ కా తోఫా ఖవాతీన్‌ కే లియే భరోసా' పేరుతో నిరుద్యోగ మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో గత నెల దరఖాస్తులు స్వీకరించారు. దీనికి సంబంధించిన అర్హుల జాబితాను అధికారులు రూపొందించారు. పథకంలో భాగంగా ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ వర్గాలకు చెందిన నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తారు.

ఆలేరు నియోజకవర్గానికి 100 మిషన్లు

కేసీఆర్‌ కా తోఫా ఖవాతీన్‌ కే లియే భరోసా కింద జిల్లాకు 365 కుట్టు మిషన్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఆలేరు నియోజకవర్గానికి 100, భువనగిరి నియోజకవర్గానికి 200, మోత్కూర్‌కు 30, చౌటుప్పల్‌కు 35 మిషన్లు పంపిణీ చేయనున్నారు. వీటికితోడు మరో 30 కుట్టుమిషన్లను క్రిస్టియన్‌ మైనారిటీల కోసం రిజర్వ్‌ చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలోని మైనారిటీ జనాభా ప్రకారం పంపిణీ చేసేందుకు 100 కుట్టు మిషన్లకు గాను ఇప్పటికే 95 మందితో తుది జాబితా సిద్ధం చేశారు. అయితే భువనగిరి నియోజకవర్గానికి వచ్చే సరికి ఒక్క భువనగిరి మున్సిపాలిటీకే 200 కుట్టు మిషన్లు కేటాయించేందుకు తుది జాబితా సిద్ధం చేశారు. దీంతో భువనగిరి మండలం, వలిగొండ, పోచంపల్లి, పోచంపల్లి మున్సిపాలిటీ, బీబీనగర్‌ మండలాల చెందిన మైనార్టీ ముస్లిం మహిళలు తమకుఎందుకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టరేట్‌ ఎదుట ఆందోళన చేస్తాం

> కేవలం భువనగిరి మున్సిపాలిటీకే 200 కుట్టు మిషన్లు కేటాయించడం వివక్షకు గురి చేస్తోంది. ఈ విషయంపై సోమవారం జరిగే ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. నియోజకవర్గంలో ఉన్న వలిగొండ, పోచంపల్లి, బీబీనగర్‌ మండలాలతోపాటు భువనగిరి మండలంలో ఉన్న నిరుపేద ముస్లిం మహిళలకు కేటాయించాలని కోరుతాం.
> – అతహర్‌, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు

హెల్త్‌ సబ్‌సెంటర్లకు సొంత భవనాలు

- రూ.5 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఒక్కో భవనానికి రూ.20 లక్షలు
- రోగులకు తీరనున్న ఇబ్బందులు



వెల్లంకిలో అద్దెభవనంలో నిర్వహిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం

రామన్నపేట : ఆరోగ్య ఉప కేంద్రాల తీరు మారునున్నది. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో మగ్గుతుండడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు ఇక శాశ్వతంగా తొలగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా వాటి పరిధిలో 143 ఉప కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో 42 సబ్‌ సెంటర్లకు సొంత భవనాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం 55 సబ్‌ సెంటర్లకు నిధులు మంజూరు కాగా నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. తాజాగా మరో 25 కేంద్రాలకు ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించిది. పనుల నిర్వహణకు టెండర్లు పిలిచే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

నిధులు మంజూరైన ఉప కేంద్రాలు ఇవే

అడ్డగూడూరు మండలంలో గట్టుసింగారం, కంచనపల్లి, కోటమర్తి, ఆత్మకూరు(ఎం) మండలంలోని కొరటికల్‌, భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు, శివారెడ్డిగూడెం, భువనగిరి మండలంలో ముత్తిరెడ్డిగూడెం, నందనం, వీరవెల్లి, వడపర్తి, వలిగొండ మండలం ప్రొద్దుటూరు, రామన్నపేట మండలం లక్ష్మాపురం, రామన్నపేట, సిరిపురం, వెల్లంకి, మోత్కూరు మండలంలో దాచారం, పాటిమట్ల, పొడిచేడు, సంస్థాన్‌నారాయణపురం మండలం చిల్లాపురం, గుజ్జ, మహ్మదాబాద్‌, పుట్టపాక, చౌటుప్పల్‌ మండలం డి.నాగారం, కుంట్లగూడెం సబ్‌సెంటర్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి.

తీరనున్న ఇబ్బందులు

హెల్త్‌ సబ్‌సెంటర్లు నిర్వహిస్తున్న అద్దెభవనాలు చాలా వరకు ఇరుకుగా ఉండడంతో పాటు సరైన వసతులు లేవు. కొన్ని చోట్ల బాత్‌ రూంలు కూడా లేవు.ముఖ్యంగా గర్భిణులకు పరీక్షలు చేయడానికి ప్రత్యేక గదులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డాక్టర్లు, సిబ్బంది సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. సొంత భవనాలు పూర్తయితే ప్రజలకు నాణ్యమైన సేవలు అందనున్నాయి.

స్థలం సిద్ధంగా ఉంది



> సిరిపురం హెల్త్‌ సబ్‌సెంటర్‌ను పదేళ్లుగా గ్రామ పంచాయతీ భవనం గ్రౌండ్‌ ఫ్లోర్‌లో నిర్వహిస్తున్నారు. పక్కా భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయం. భవన నిర్మాణానికి రాపోలు నర్సయ్య అతని సోదరులు విరాళంగా ఇచ్చిన స్థలం సిద్ధంగా ఉంది.
> –అప్పం లక్ష్మినర్సు, సర్పంచ్‌, సిరిపురం

నిధుల మంజూరు హర్షణీయం



> వెల్లంకి హెల్త్‌ సబ్‌సెంటర్‌ పరిధిలో వెల్లంకి, సర్నేనిగూడెంతో పాటు మరో ఆరు ఆవాసాలు ఉన్నాయి. ప్రస్తుతం సబ్‌ సెంటర్‌ అద్దె భవనంలో నడుస్తోంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయం. భవన నిర్మాణానికి స్థలం అందుబాటులో ఉంది.
> –ఎడ్ల మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌, వెల్లంకి

మెరుగైన సేవలు అందుతాయి



> జిల్లాలో 143 పీహెచ్‌సీలు ఉన్నాయి. గత సంవత్సరం 55 సెంటర్లకు పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పనులు ప్రగతిలో ఉన్నాయి. తాజాగా 25 సబ్‌ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇవి అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్యసేవలు అందుతాయి.
> –డాక్టర్‌ మల్లికార్జున్‌, డీఎంహెచ్‌ఓ

పరిపాలనా సౌలభ్యానికే నూతన పంచాయతీలు



అంతమ్మగూడెంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: పరిపాలన సౌలభ్యానికే సీఎం కేసీఆర్‌ మధిర గ్రామాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దారని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని అంతమ్మగూడెంలో రూ.20లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనం, జిబ్లక్‌పల్లి గ్రామంలో రూ.16 లక్షల సీడీఎఫ్‌ నిధులతో నిర్మించిన పశువైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిలాయిపల్లి సాగునీటి కాల్వలను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికే దక్కిందన్నారు. హెచ్‌ఎండీఏ నిధులతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అర్హులైన పేదలకు త్వరలో నూతన రేషన్‌కార్డులు అందజేస్తామని చెప్పారు. అంతమ్మగూడేనికి మహిళా సంఘం భవనానికి నిధులు మంజూరు చేస్తామని, గ్రామానికి రేషన్‌షాపు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ చిట్టిపోలు విజయలక్ష్మి, వైస్‌ఎంపీపీ పాక వెంకటేష్‌, సర్పంచులు వస్పరి పారిజాత, చిన్నలచ్చి లింగస్వామి, ఎంపీడీఓ బాలశంర్‌, పశువైద్యాధికారి శ్రీనివాస్‌, వెంకటేశ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ కందాడి భూపాల్‌రెడ్డి, సర్పంచ్‌, ఎంపీటీసీల ఫోరమ్‌ మండల అధ్యక్షులు సామ రవీందర్‌రెడ్డి, బత్తుల మాధవి, ఎంపీటీసీ రావుల శ్రీదేవి, ఉపసర్పంచులు ఆర్ల లింగస్వామియాదవ్‌, గుమ్మి జయనరేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ పగిళ్ల సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, వస్పరి వెంకటేశ్‌, వస్పరి జంగమ్మ, బండ బాలమ్మ, వల్లూరి జంగయ్య, అండాలు, గుమ్మి దామోదర్‌రెడ్డి, ముమ్మడి రాజు తదితరులు పాల్గొన్నారు.

భీమలింగం వాగుపై హై లెవల్‌ బ్రిడ్జి నిర్మించాలి

ఆత్మకూరు(ఎం): మండలంలోని రాఘవాపురం–కూరెళ్ల గ్రామాల మధ్య భీమలింగం వాగుపై హై లెవల్‌ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్‌ అన్నారు. ఆదివారం మండలంలోని కూరెళ్ల–రాఘవాపురం గ్రామాల మధ్య భీమలింగం వాగుపై దెబ్బతిన్న రోడ్డును పరిశీలించి నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు వాగుపై బ్రిడ్జి దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, బాషబోయిన బుగ్గయ్య, బండ బీరయ్య, అవనగంటి సోమయ్య, బుర్ర రాములు తదితరులు పాల్గొన్నారు.



భీమలింగం వాగును పరిశీలిస్తున్న ఎండీ జహంగీర్‌

మట్టపల్లిలో శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ,చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. అనంతరం ఎదుర్కోలు మహోత్సవం, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణం జరిపించారు.

క్లుప్తంగా

రాష్ట్ర సరిహద్దులో గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీసన్న

నాగార్జునసాగర్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ బీసన్న కేసు వివరాలు వెల్లడించారు. ఆంధ్రా–తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని నాగార్జునసాగర్ చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మిర్యాలగూడకు చెందిన షేక్‌మీర్జా వలి, షేక్ యూసూఫ్ బైక్‌పై వస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని నిలిపి బైక్‌ను తనిఖీ చేయగా సీటు కింద 160 గ్రాముల గంజాయి లభ్యమైంది. అదుపులోకి తీసుకుని విచారించగా తమకు గంజాయి తాగే అలవాటు ఉందని, మాచర్ల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. గంజాయితో పాటు వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. గంజాయి నేరస్తులను పట్టుకున్న విజయపురి ఎస్ఐ ఎస్.సంపత్, పోలీసులను ఆయన అభినందించారు.

విద్యుత్ మోటార్లు చోరీ

చిలుకూరు : గుర్తుతెలియని వ్యక్తులు పలువురు రైతుల విద్యుత్ మోటార్లు చోరీ చేశారు. ఈ ఘటన చిలుకూరు మండల కేంద్రంలో వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం నుంచి బేతవోలు గ్రామానికి వెళ్లే రోడ్డులో చిలుకూరుకు చెందిన కాసాని లక్ష్మణ్, అత్తులూరి శ్రీహరి, కొల్లు నాగేశ్వరరావు వ్యవసాయ బావులు ఉన్నాయి. దుండగులు వీరి పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు, వైర్లను అపహరించుకుపోయారు. ఆదివారం రైతులు వ్యవసాయ భూముల వద్దకు వెళ్లగా చోరీ విషయాన్ని గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్

కట్టంగూర్ : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అయిటిపాముల గ్రామానికి చెందిన గీత కార్మికుడు నీలం చంద్రశేఖర్ రోజు వారీ మాదిరిగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

గుర్రంపోడు : మండలంలోని తేనపల్లి గ్రామంలో ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లి పోయిన శివార్ల వెంకటయ్య ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. మతిస్థిమితం సరిగా లేని వెంకటయ్య నల్లగొండ బస్టాండ్ పరిసరాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం తెలియగా తీసుకువచ్చి ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

పరారీలో చిట్టీల వ్యాపారి..?

- రూ.4కోట్లతో ఉడాయించినట్లు ఆరోపణలు
- నాలుగు నెలలుగా అజ్ఞాతంలోనే..
- 20 రోజుల క్రితం వరకు డబ్బులు ఇస్తానంటూ బాధితులకు సెల్‌ఫోన్ మెసేజ్‌లు
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్న బాధితులు
- శాలిగౌరారం మండలంలో వెలుగుచూసిన మోసం



శాలిగౌరారం మండలం ఆకారంలో పరారీలో ఉన్న చిట్టీల వ్యాపారి ఇల్లు

శాలిగౌరారం : ఓ చిట్టీల వ్యాపారి సభ్యులను నిండా ముంచి రూ.4కోట్లతో ఉడాయించాడు. రాత్రికి రాత్రే బిచానా ఎత్తేసిన అతడి ఆచూకీ నాలుగు నెలలుగా తెలియకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్ల క్రితం కొంతమంది సభ్యులతో చిట్టీల వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఆకట్టుకునే మాటతీరు, నమ్మకం కలిగించే వైఖరితో సదరు వ్యాపారి వ్యాపారాన్ని విస్తరించాడు. మొదట్లో పదుల సంఖ్యలోనే సభ్యులు ఉన్న అతడి చిట్టీల వ్యాపారంలో శాలిగౌరారం, నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేట, మోత్కూరు, అర్వపల్లి మండలాలకు చెందిన వారితో పాటు హైదరాబాద్ వాసులతో కలిపి మొత్తం 700 మంది ఉన్నారని తెలిసింది. ప్రస్తుతం ఆయన నిర్వహిస్తున్న వ్యాపారంలో సుమారు 300 మందికి పైగా చిట్టీ పూర్తై డబ్బులు పొందని వారు ఉన్నారు. వారి చిట్టీల విలువ రూ.3 కోట్లు. అంతేగాకుండా అతనిని నమ్మి కొంతమంది అప్పులు కూడా ఇచ్చారు. వాటి విలువ రూ.కోటి వరకు ఉంటుందని సమాచారం.

డబ్బులు రాగానే చెల్లిస్తానంటూ..

సదరు చిట్టీల వ్యాపారి 20రోజుల క్రితం వరకు చిట్టీల సభ్యులకు ఫోన్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిసింది. డబ్బులు రావాల్సి ఉందని.. చేతికి అందగానే గ్రామానికి వచ్చి మీకు రావాల్సిన మొత్తాన్ని సెటిల్ చేస్తానంటూ సెల్‌ఫోన్ మెసేజ్‌లు పెట్టినట్లు బాధితులు పేర్కొంటున్నారు. మెసేజ్‌ల అనంతరం ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్‌లో ఉండేదని తెలిపారు. అయితే, ఇదంతా వ్యాపారి మోసంలో భాగమేనని బాధితులు ఆరోపిస్తున్నారు. కాగా, విషయం తెలిసిన కొంతమంది బాధితులు అతడి ఇంటివద్ద ఉన్న ట్రాక్టర్(ఇంజన్), వాటర్ ట్యాంకర్, ద్విచక్ర వాహనంతో పాటు ఇతరత్రా వస్తువులను ఎవరికి అందినవి వారే తీసుకెళ్లారు. కొంతమంది ఇంటికి తాళం వేశారు.

చిట్టీల డబ్బులతో ఆస్తుల కొనుగోలు..?

చిట్టీల వ్యాపారాన్ని నిర్వహించిన సదరు వ్యాపారి హైదరాబాద్, ఖమ్మం, సిద్దిపేట పట్టణాల్లో స్థలాలు, భవనాలు కొనుగోలు చేసినట్లు సమాచారం. హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన ఓ భవనం వివాదాల్లో ఉండి కోర్టులో కేసు నడుస్తున్నట్లు తెలిసింది. వ్యాపారి ఇటీవలే ఆ వివాదాన్ని సెటిల్ చేసుకొని ఆ భవనాన్ని విక్రయించేందుకు ప్రయత్నించడంతో సమాచారం అందుకున్న కొంతమంది బాధితులు హైదరాబాద్‌కు వెళ్లడంతో పసిగట్టిన ఆయన సెటిల్‌మెంట్ కోసం రాకుండా తప్పించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాకుండా తన పేరిట ఉన్న స్థిరాస్తులను మార్పిడి చేసి ఆ తర్వాతా కోర్టును ఆశ్రయించి ఐపీ పెట్టాలనే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది.

గతంలోనూ ఎరువుల వ్యాపారికి..

సదరు చిట్టీల వ్యాపారిపై ఇప్పటికే అనేక ఆర్థికపరమైన ఆరోపణలు, వివాదాలు ఉన్నాయి. గతంలో సూర్యాపేటకు చెందిన ఓ వ్యాపారి వద్ద అతడు ఎరువులు తెచ్చి ఇక్కడ వ్యాపారం చేసి చివరకు అతడికి డబ్బులు చెల్లించకుండా కుచ్చు టోపీ పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు దశాబ్దాల క్రితం తన నానమ్మ వద్ద ఉన్న సుమారు వంద తులాల బంగారం కాజేసి.. ఆ నేరం నక్సలైట్ల మీద తోసి కుటుంబ సభ్యులను సైతం మోసం చేసినట్లు గ్రామస్తులు చెప్పుకోవడం గమనార్హం. ప్రస్తుతం వ్యాపారి నుంచి సెల్ మెసేజ్‌లు కూడా నిలిచిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. పోలీసు కేసు పెడితే డబ్బులు వస్తాయో, రావోననే భావనతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నట్లు తెలుస్తోంది.

బండరామారంలో భగ్గుమన్న భూ తగాదాలు

- ఒకరిపై గొడ్డలితో దాడి.. తీవ్ర గాయాలు



భూ తగాదాల్లో గాయపడ్డ ఉప్పుల ఎల్లయ్య

తుంగతుర్తి: తుంగతుర్తి మండలం బండరామారంలో భూ తగాదాలు భగ్గుమన్నాయి. ముగ్గురు వ్యక్తులు గొడ్డలితో ఒకరిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. తుంగతుర్తి మండల పరిధిలోని బండరామారం గ్రామానికి చెందిన ఉప్పుల ఎల్లయ్యకు అదే గ్రామానికి చెందిన కొల్లూరు సోమనరసయ్య, భాస్కర్, మహేష్‌లకు భూ తగాదాలు ఉన్నాయి. రైతులందరు కలిసి ఎస్సారెస్పీ కాల్వ కట్ట నుంచి తమ పొలాల వద్దకు వాహనాలు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసుకున్నారు. ఆ దారికి అయిన ఖర్చులు ఎల్లయ్య చెల్లించపోగా ఆయన పొలంపై ఉన్న రైతులను పోకుండా అడ్డుకుంటున్నాడు. ఆదివారం ఎల్లయ్య తన పొలం వద్దకు ట్రాక్టర్ వేసుకొని వెళ్తుండగా చుట్టుపక్కల ఉన్న రైతులు అడ్డుకొని ప్రశ్నించారు. వారి మధ్య మాట పెరిగి కోపంతో ఎల్లయ్యపై కొల్లూరు సోమనరసయ్య, భాస్కర్, మహేష్‌లు కలిసి గొడ్డలితో దాడిచేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితుడిని కుటుంబ సభ్యులు తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీన్ తెలిపారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్ఐ

హుజూర్‌నగర్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు వేసి ఉన్న రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. హుజూర్‌నగర్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనలపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీలో ఉంటున్న బెల్లంకొండ నాగేశ్వరరావు, పాలవరపు వెంకట నర్సమ్మలు ఇళ్లకు తాళాలువేసి ఊరికి వెళ్లారు. రాత్రి సమయంలో దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. నాగేశ్వరరావు ఇంట్లో రూ.15వేల నగదు, కేబుల్‌వైర్ దొంగిలించారు. వెంకట నర్సమ్మ ఇంట్లో వెండి వస్తువులు, బంగారపు ఉంగరం, రూ 3 వేల నగదు అపహరించారు. బాధితులు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

ఉరేసుకుని వలస కార్మికుడి ఆత్మహత్య

రామగిరి(నల్లగొండ): ఉరేసుకుని ఓ వలస కార్మికుడి ఆత్మహత్య చేసుకున్నాడు. తిప్పర్తి మండలంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ (కుందన్)(22) తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద గల సాయి వెంకటేశ్వర రైస్ మిల్లులో హమాలీగా పని చేస్తున్నాడు. సుమారు 6 నెలల క్రితం వివాహం అయింది. 4 నెలల క్రితం రైస్ మిల్లులో హమాలీ పని చేసేందుకు వచ్చాడు. శనివారం అర్ధరాత్రి తర్వాత చాలా సేపటి వరకు ఫోన్‌లో తీవ్రంగా సంభాషణ జరిగింది. ఆ తర్వాత మిల్లు వెనక భాగంలో ఉన్న గోదాములో ఉరి వేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున తనతో పాటు పని చేసే కూలీ చూసే సరికి రాజ్‌కుమార్ ఉరి వేసుకుని విగత జీవిలా పడి ఉన్నాడు. మిల్లు యాజమాన్యానికి, పోలీసులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ కలహాల లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు.రాజ్‌కుమార్ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో ఉంచారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం మొరిపిరాల పరిధి ఎల్కబావివద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎలకబావివద్ద గ్రామానికి చెందిన బండారి ప్రశాంత్ నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు వద్ద మేస్త్రీ పనులు చేస్తుంటాడు. నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఆదివారం బైక్‌పై తిరిగి వెళుతుండగా గొర్రె అడ్డుగా వచ్చింది. దీంతో బైక్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య ?

- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు



ఘటనా స్థలంలో నల్ల సైదులు మృతదేహం (ఫైల్)

ఆత్మకూరు(ఎం) : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల పరిధిలోని పాడిచేడులో శనివారం వెలుగులోకి వచ్చిన ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లికి చెందిన నల్ల సైదులు హత్య వివాహేతర సంబంధం నేపథ్యంలోనే జరిగినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. లింగరాజుపల్లి గ్రామానికి చెందిన నల్ల సైదులు(35) బోర్ బండిపై హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పని చేస్తుంటాడు. ఏడాది క్రితమే గ్రామానికి వచ్చి కట్టెకోత పనికి వెళుతున్నాడు. సైదులుకు శాలిగౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన ధనమ్మతో కొన్నేళ్ల క్రితం వివాహం అయింది. వివాహనంతరం ఇద్దరు కుమారులు కలిగారు. కొంత కాలం నుంచి భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో పెద్ద మనుషులు సర్దిచెప్పారు. బుధవారం భార్య ధనమ్మ తన ఇద్దరు కుమారులతో పుట్టింటికి వెళ్లింది. మరునాడు గురువారం భార్యను తీసుకొద్దామని సైదులు గురజాలకు వెళ్లినట్లు తెలిసింది. భార్య రాకపోవడంతో శుక్రవారం సైదులు ఒక్కడే తిరుగు ప్రయాణం అయ్యాడు. అదే రోజు మోత్కూరు మండలం పాడిచేడు మూసీ నది ఒడ్డున గంగదేవమ్మ గుడి సమీపంలో విగతజీవుడై కనిపించాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే సైదులును హత్య చేసి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. రామన్నపేట సీఐ మోతిలాల్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు విచారణ జరుగుంది. శనివారం సాయంత్రం లింగరాజుపల్లి గ్రామాన్ని పోలీసులు సందర్శించారు. గ్రామస్తుల నుంచి కూడా వివరాలు సేకరించారు. హతుడి భార్య ధనమ్మతో పాటు గురజాల గ్రామానికి చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

నాగయ్యకు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉద్యోగి కట్ట నాగయ్య రాష్ట్ర ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు అందుకున్నారు. భారత లైబ్రరీ సైన్స్ పితామహుడు ఎస్ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి బి.బాలమ్మ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కట్ట నాగయ్య

దైవదర్శనానికి వెళ్లొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు



నేరేడుచర్ల : గాయపడిన ప్రభాకర్

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ధర్వేముల ప్రభాకర్, పద్మ దంపతులు ఆదివారం బైక్‌పై వెళ్లి కోదాడ మండలం ఎర్రవరంలోని బాల ఉగ్రనర్సింహ్మస్వామిని దర్శనం చేసుకున్నారు. సాయంత్రం తిరిగి తమ బైక్‌పై మిర్యాలగూడకు వస్తున్నారు. మార్గమధ్యలో నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ వద్ద మిర్యాలగూడ నుంచి కోదాడ వైపు వెళ్తున్న కారు వీరి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న భార్యభర్తలు కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో పద్మ(45) మృతి చెందింది. ప్రభాకర్ చికిత్స పొందుతున్నాడని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కారు ఢీకొని ..

మునగాల(కోదాడ): జాతీయ రహదారిపై మునగాల మండలం మాధవరం శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన దేశగాని సైదులు (55) తన మనుమడితో కలసి బైక్‌పై సూర్యాపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న సైదులు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. బైక్‌పై ఉన్న సైదులు మనుమడు అరవింద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కోదాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సైదులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.లోకేష్ తెలిపారు.

నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు లాంచీల్లో నాగార్జునకొండకు వెళ్లి అక్కడ మ్యూజియంలో అలనాటి నాగరికత విశేషాలతో పాటు, బుద్ధుడి శిల్పాలు, చైత్యాలు, కృష్ణానదీతీరం నుంచి ఇతర ప్రాంతాలకు పడవల్లో చేసిన వ్యాపార సంబంధిత ఆనవాళ్లను పరిశీలించారు. అనంతరం సాగర్ జలాశయతీరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బుద్ధవనాన్ని సందర్శించారు.



లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ కోరారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని వాసవీ భవన్‌లో హుజూర్‌నగర్ ఆఓపా వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 96 మంది విద్యార్థులకు రూ 3.20 లక్షల ఉపకార వేతనాలు, 41 మంది మహిళలకు రూ.200ల చొప్పున పెన్షన్, చీరలు, ముగ్గురికి మహిళలకు గ్రైండర్లు, ఇరువురికి తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా పేద వైశ్యులకు రుణాలు ఇప్పించి ఆదుకోవాలన్నారు. పేద ఆర్యవైశ్యులకు అండగా నిలవడంతో ఆఓపానే ఆదర్శంగా నిలించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములు, ఆవోపా హుజూర్‌నగర్ శాఖ అధ్యక్షుడు వంగవీటి హనుమంతరావు, లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు సహించం

- మరో 100రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ క్రైం : కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు సహించబోమని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన తుక్కాని వెంకట్‌రెడ్డిని నల్లగొండ రూరల్ పోలీసులు స్టేషన్‌కు రావాలని పిలిచారు. అదే గ్రామానికి చెందిన దోరెపల్లి మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎంపీ కోమటిరెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అక్కడ ఎస్ఐ లేకపోవడంతో ఫోన్ చేసి మాట్లాడారు. మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి కొట్టడం సరికాదన్నారు. మరో 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని పెద్దల సమక్షంలో పరిష్కారం అయిన చిన్న వివాదాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడం సరికాదన్నారు. తప్పు చేస్తే పిలిపించి మాట్లాడాలి. కావాలని పిలువడమేంటని ఎస్ఐ ప్రశ్నించారు. ఓపిక నశించే వరకు చేయొద్దన్నారు. ఈ విషయమై ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా మహేందర్‌రెడ్డిపై మరికొంత మందితో కలిసి వెంకట్‌రెడ్డి దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారని, ఈ విషయమై మాట్లాడేందుకు పోలీస్ స్టేషన్‌కు పిలిచామన్నారు.

బుద్దారంలో చిచ్చురేపుతున్న ఆడియో

కొందరు పోకిరీలు సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ మహిళల పట్ల కించపరిచే వ్యాఖ్యలు చేయడం, వివాహేతర సంబంధాలను ఆపాదించడం వంటి మాటల సంభాషణ ఆడియో బుద్దారంలో చిచ్చురేపింది. గతంలో ఇలాంటి ఘటనలే జరగడంతో పోలీసులు తమదైన శైలిలో మందలించారు. మద్యం మత్తులో పోకిరీలు మహిళల గౌరవాన్ని కించపరిచేలా లేనిపోనివి ఆపాదిస్తూ సెల్‌ఫోన్‌లో రికార్డు చేయడం, మాటల సంభాషణ నలుగురిలోకి రావడంతో ఆగ్రహానికి ఆజ్యం పోస్తుంది. పోలీసులు సరైన రీతిలో స్పందించకపోతే అనేక కుటుంబాల్లో సెల్‌ఫోన్ చిచ్చు పెడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు.

పత్తిలో పురుగుల నివారణకు యాజమాన్య పద్ధతులు

- పెద్దవూర ఏఓ సందీప్ సూచనలు



పెద్దవూరలో సాగవుతున్న పత్తి చేను

పాడి పంట

పెద్దవూర : సకాలంలో సస్యరక్షణ చర్యలు.. సేంద్రియ ఎరువులతో పాటు అధికారులు సిఫారసు చేసిన పురుగు మందులను వాడితే బీటీ పత్తి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ సూచిస్తున్నారు. రైతులు బీటీ పత్తిలో యాజమాన్య పద్ధతులపై ఏఓ సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

రసం పీల్చు పురుగులు ఆశించే దశలో..

విత్తన శుద్ధి పాటించటం ద్వారా దాదాపు 30 రోజుల వరకు రసం పీల్చే పచ్చదోమ, పేనుబంక, తామర పురుగులను అరికట్టవచ్చు. ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యూఎస్ లేక థయామిథాక్సామ్ 70 డబ్ల్యూఎస్ మందులను ఒక కిలో విత్తనానికి 4 నుంచి 5 గ్రాముల వరకు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. సిఫారసు చేసిన మేరకు రసాయన ఎరువులను ఉపయోగించాలి. సేంద్రియ ఎరువులను విధిగా ఉపయోగించటం వలన నేల సత్తువ పెరుగుతుంది. అంతర పంటలైన సోయాచిక్కుడు, పెసర, మినుము, బొబ్బర, కొర్ర వంటి పంటలను సాగు చేయడం ద్వారా మిత్ర పురుగులు బాగా వృద్ధి చెంది కొంత వరకు రసం పీల్చు పురుగుల నియంత్రణకు దోహదపడతాయి.

పూత పద్ధతిలో..

తొలి దశలో ఆశించే పురుగులను అదుపు చేయటానికి కాండం మీద పూత పద్ధతిని పాటించాలి. 3 పర్యాయాలు 30, 45 రోజుల్లో మోనోక్రోటోఫాస్ 1:4(ఒక భాగం మందు, 4 భాగాలు నీళ్లు) నిష్పత్తిలో వాడాలి. తిరిగి 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ 1:20 నిష్పత్తిలో(ఒక పాళ్ల మందు, 20 పాళ్ల నీరు) వాడాలి. కాండం, పూత పద్ధతి ద్వారా పచ్చదోమ, పేనుబంక, పిండినల్లి పురుగులను ఎటువంటి పురుగు మందుల పిచికారీ లేకుండా 70–80 రోజుల వరకు అదుపు చేసుకోవచ్చు.

కాయతొలుచు పురుగు ఆశించే దశ..

60 నుంచి 90 రోజుల పంట దశలో పత్తి పైరులో సాధారణంగా పూత ఏర్పడిన దగ్గరి నుంచి కాయతొలుచు పురుగులు ఆశించటం మొదలవుతుంది. ముఖ్యంగా తలనత్త, శనగ పచ్చపురుగు, పొగాకు లద్దె పురుగులు పంటను వివిధ దశలలో ఆశించి తీవ్ర నష్టం కలిగిస్తాయి. ఎకరంలో 50 శాతం మొక్కలలో కనీసం ఒక్కొక్క మొక్కను ఒక గూడ కంటే ఎక్కువ నష్టపోతే (పురుగు చేసిన రంధ్రంతో విచ్చుకున్న గూడలు) 5 శాతం వేపగింజల కషాయం పిచికారీ చేస్తే శనగపచ్చ పురుగు గుడ్లను, మొదటి దశ గొంగళి పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు. వేపగింజల కషాయం 5 శాతం లేదా 0.5 శాతం వేపనూనె లేదా 0.2 నుంచి 0.5 శాతం పిచికారీ చేయవచ్చు. పొగాకు లద్దె పురుగు నివారణకు లీటరు నీటికి 1.0 మి.లీ. నోవల్యూరాన్ లేదా 1.0 మి.లీ. లూఫెన్యూరాన్ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను 0.5 మి.లీ. పిచికారీ చేయాలి.

గులాబీ రంగు పురుగు, పిండినల్లి పురుగు

120 రోజుల తర్వాత దశలో గులాబీ రంగు పురుగు పిండినల్లి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. గులాబీ రంగు పురుగు నష్టపరిమితి స్థాయిని గమనించి పత్తి పంటలో అక్కడక్కడా కొన్ని కాయలను కోసి తెరిచి చూడాలి. పది కాయలకు ఒక లార్వా ఉంటే నష్టపరిమితి స్థాయి అధిగమించినట్లుగా గుర్తించాలి. అవసరం మేరకు పంట చివరి దశలో ఒకటి లేదా రెండు పర్యాయాలు సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను పిచికారీ చేయడం ద్వారా పురుగును నివారించవచ్చు. పెద్ద గొంగళి పురుగులను ఏరి నాశనం చేయాలి. పిండినల్లి నివారణకు ఎసిఫేట్ లేదా ప్రొఫెనోపాస్ మందులను వాడాలి. పంట విత్తిన వెంటనే 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించినట్లయితే ఎకరాకు 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలను పెట్టాలి. బుట్టలో 8 తల్లి రెక్కలు పడినట్లయితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

శనగపచ్చ పురుగు ఆశించు దశ

90 నుంచి 120 రోజుల దశలో శనగపచ్చ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. 90 రోజుల నుంచి బీటీ పత్తిలో గూడ, పిందెలలో ఉండే బీటీ ప్రోటీన్ స్థాయి క్రమేపి తగ్గుతూ ఉండటం వలన శనగ పచ్చ పురుగుల నియంత్రణ తగ్గుతూ ఉంటుంది. ఈ దశలో ఏవైనా గొంగళి పురుగుల నష్టపరిమితి స్థాయి గమనిస్తే 1 లేదా 2 పర్యాయాలు క్రిమి సంహారక మందులు ఉపయోగించటం ద్వారా పురుగును అదుపు చేయవచ్చు. థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ. ను పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు సిఫార్సు చేసిన పురుగు మందులను 3మి.లీ. వేపనూనె కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చు పురుగుల నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా 2.0 మి.లీ. ఫిప్రోనిల్ లేదా .03 గ్రాముల ఫ్లోనికామిడ్ లేదా 1.25 గ్రాముల డైఫెనిథియురాన్ లీటరు నీటికి కలిపి వాడాలి.